క్లుప్తంగా

6న గృహ సారథులు, కన్వీనర్లతో సమావేశం

చింతూరు: మండలంలోని ఎర్రంపేటలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల విస్తృతస్థాయి సమావేశం ఈనెల 6న నిర్వహించనున్నట్టు సొసైటీ అధ్యక్షుడు తోట రాజేశ్వరరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరవుతారని, మండలంలోని పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన కోరారు.

సమష్టిగా పనిచేయాలి


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మాజీ అధికార ప్రతినిధి శెట్టి అప్పాలు

అరకులోయ రూరల్: వైఎస్సార్‌సీపీ గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పార్టీకి ఎంతో కీలకమని నాయకుడు శెట్టి అప్పాలు అన్నారు. గ్రామస్థాయిలో పార్టీ మరింత బలోపేతం కోసం అందరూ సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కన్వీనర్ సంపత్‌కుమార్, వైస్ ఎంపీపీ రామన్న, నాయకులు రంజిత్‌కుమార్, నర్సింగ్, బాలరాజు, గురు తదితరులు పాల్గొన్నారు.

మెనూ సక్రమంగా అమలుచేయాలి


నిరసన తెలుపుతున్న విద్యార్థులు

అరకులోయ రూరల్: పెంచిన మెస్ చార్జీలు అమలుచేయాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులు నిరసన తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు సీమోన్ మాట్లాడుతూ సంబంధిత అధికారులు చొరవ తీసుకుని వసతి గృహాల్లో మెనూ సక్రమంగా అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ధనలక్ష్మి, రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ ధరలు తగ్గించాలి


కూనవరం పాత బస్‌స్టాండ్ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న కార్యకర్తలు

కూనవరం: కేంద్ర ప్రభుత్వం పెంచుతున్న గ్యాస్ ధరలను తగ్గించాలని సీపీఎం మండల కమిటీ డిమాండ్ చేసింది. పాత బస్టాండ్ సెంటర్‌లో పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు పెంటయ్య మాట్లాడుతూ గతంలో రూ.470 ఉన్న వంటగ్యాస్ ధర బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక క్రమేపీ పెంచుకుంటూ పోతు రూ.1250 చేరిందని, ఇది సామాన్యుడు నెత్తి మీద గుదిబండ వేసిందని ఆరోపించారు. సీతారామయ్య, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, ఈశ్వర్లు, కృష్ణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు నట్టల నివారణ మందు


సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి గౌతమ్

దుంబ్రిగుడ: మండల కేంద్రంలో పశుసంవర్ధక శాఖ సిబ్బందితో వైద్యాధికారి గౌతమ్ శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉన్న పశువుల కు నట్టల నివారణ మందులు తప్పకుండా వేయాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 4 నుంచి ప్రతి గ్రామంలో కూడా పశు వైద్య శిబిరం నిర్వహించి, నట్టల నివారణ మందులను పశువులకు వేయాలని ఆదేశించారు. పశు వ్యాధులపై నిర్లక్ష్యం చేయవద్దని, ఎటువంటి నిర్లక్ష్యం చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. సిబ్బంది సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక అమ్మవారికి ప్రత్యేక పూజలు

ఎస్.రాయవరం: గోకులపాడు నూకాంబిక అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. జనసేన త్రినాథరావు, అమ్మాజీ దంపతుల ఆర్థిక సాయంతో ఆలయంలో అన్న సమారాధన చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తీరనున్న వెతలు

- జోరుగా టవర్ల ఏర్పాటు పనులు
- ఆనందంలో గిరిజనులు


పులుపుమామిడిలో జియో టవర్

జి.మాడుగుల: జిల్లా ఏజెన్సీ మారుమూల ప్రాంతాల్లో సెల్ సిగ్నల్ సమస్యలు తొలగనున్నాయి. ఆదివాసీలకు సెల్‌ఫోన్ పరిజ్ఞానంతో పాటు సమాచార వ్యవస్థ పటిష్టం కానుంది. మారుమూల గ్రామాల్లో సెల్ సిగ్నల్ వ్యవస్థ లేకపోవడం వలన గిరిజనులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రేషన్, పింఛన్‌లు, ఇతర ప్రభుత్వ పథకాలు బయోమెట్రిక్‌కు, పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరుకు, అత్యవసర వైద్యసేవల కోసం ఇక్కట్లు తప్పడం లేదు. అయితే సమస్యను రూపుమాపేందుకు ప్రభుత్వం విస్తృతంగా సెల్ టవర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా కోట్లాది రూపాయలు వెచ్చిస్తోంది. పనులు శరవేగంగా జరిగేలా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. మారుమూల గ్రామాల్లో పూర్తి స్థాయిలో సమాచార వ్యవస్థ అందించే విధంగా సెల్ టవర్లు ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. చాలా ప్రాంతాల్లో జియో, బీఎస్ఎన్ఎల్, ఎయిటెల్ టవర్లును ఏర్పాటుకు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా జి.మాడుగుల మండలంలో జియో,బిఎస్ఎన్ఎల్, ఎయిటెల్ నెట్‌వర్క్‌లు టవ్ల ఏర్పాటు కు ముందుకొచ్చాయి. జి.మాడుగులలో కలిపి 270 టవర్లు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే అనేక గ్రామాలోని టవర్లు ప్రారంభమయ్యాయి. మారుమూల గ్రామాల్లో సెల్ ఫోన్ సేవలు అందుబాటులోనికి రావటంతో గిరిజన ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆనందంగా ఉంది

మండలంలో కిల్లంకోట, బొయితిలి పంచాయతీల్లో సుబ్బులు, రాపల్లి, పులుసుమామిడి గ్రామాల్లో మూడు జియో టవర్లు సిగ్నల్ వ్యవస్థను ప్రారంభించారు.అనేక గ్రామాల్లో సెల్ వినియోగంలోనికి వచ్చింది. దీంతో సెల్ కష్టాలు తీరాయి.108 వంటి అత్యవసర సర్వీసులకు సమాచారం అందించి ప్రజలు సేవలు పొందుతున్నారు.సెల్‌లు పని చేయడంతో ఆనందంగా ఉంది.

– ఎల్ మాలన్న, సర్పంచ్, బొయితిలి,జి.మాడుగుల మండలం



విశాఖలో ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, పాడేరు, అరకు ఎమ్మెల్యేలు కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ, జీసీసీ చైర్‌పర్సన్ స్వాతిరాణి

సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల పాత్ర కీలకం


మాట్లాడుతున్న మహిళా కన్వీనర్ విజయలక్ష్మి

వీఆర్ పురం: రేఖపల్లిలో ఆదివారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల విస్తృతస్థాయి సమావేశానికి పార్టీ శ్రేణులు తరలిరావాలని మండల కన్వీనర్ల ఇన్‌చార్జి బొడ్డు సత్యనారాయణ, మండల మహిళా కన్వీనర్ రేఖపల్లి ఎంపీటీసీ సభ్యురాలు బంధం విజయలక్ష్మి అన్నారు. రేఖపల్లిలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సమావేశానికి రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరవుతారని వారు చెప్పారు. ఎస్టీ, ఎస్సీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బాలు, ఉప సర్పంచ్ రాంబాబు, నాయకులు గంగులు, సత్తిబాబు, జయరాజ్, వెంకటరమణ , వెంగళరావు, చీమల కాంతారావు, మోడెం నరేష్, మోడెం రాజేష్,జొన్నాడ నాగేశ్వరరావు, రాజుపేట ఉప సర్పంచ్ ముంజపు రాంబాబు,గణిత్రి కృష్ణ ,కడుపు సాయి, నాల్లారపు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

రవిబాబుకు అభినందనలు


ఎస్టీ కమిషన్ చైర్మన్ రవిబాబుకు శాలువా కప్పి అభినందనలు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

అరకులోయ: గవర్నర్ కోటాలో ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబును ఎమ్మెల్సీగా సిఫార్సు చేయడంపై అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. అరకులోయలో శుక్రవారం పర్యటించిన రవిబాబును సుంకరమెట్ట గ్రామంలో పలువురు నేతలు కలిశారు. మండల అధ్యక్షుడు కొర్రా గాసీ, మాజీ సర్పంచ్ గొల్లోరి ప్రసాద్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు భాస్కర రావు, పీసా కమిటీ అధ్యక్షులు సొమర, కొర్ర డొంబు, వార్డు సభ్యులు ధర్మనాయుడు,రామారావు, అబ్రహంతో పాటు గిరిజన ఉద్యోగ,ఉపాధ్యాయ సంఘాల నాయకులంతా డాక్టర్ రవిబాబుకు దుశ్శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలిపారు.

పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరి


రోగులకు వైద్య సేవలందిస్తున్న వైద్యాధికారి రమేష్, సిబ్బంది

ముంచంగిపుట్టు: మండలంలోని పెదగూడ పంచాయతీ కేంద్రంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా కిలగాడ వైద్య సిబ్బంది శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. వ్యాధులు వాటి నివారణ కోసం చేయాల్సిన పనులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 68 మందికి వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి రమేష్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటిస్తే ఎటువంటి వ్యాధులు దరిచేరవన్నారు. అందరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. కిలగాడ పీహెచ్‌పీ ఆరోగ్య విస్తరణ అధికారి సుబ్రహ్మణ్యం, సిబ్బంది పెద్దమ్మీ, చంద్రకళ, పుష్పలమ్మ, మహేష్, యాషేస్‌లు పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నీ విజేత బోయలగూడెం జట్టు


విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న ఎంపీపీ రమేష్, జెడ్పీటీసీ నూకరాజు తదితరులు

కొయ్యూరు: మండల కేంద్రంలో లోకులగాంధీ జ్ఞాపకార్థం నిర్వహించిన వాలీబాల్ పోటీల ఫైనల్ శుక్రవారం జరిగింది. బోయలగూడెం జట్టు విజేతగా నిలిచింది. రాజవమ్మంగికి చెందిన కింద్ర జట్టు రన్నర్‌గా నిలిచింది. తోడు ట్రస్టుకు చెందిన గోకిరి గ్రామాన్ని దత్తత తీసుకున్న మురళీకృష్ణ యువ సైన్యం ఆధ్వర్యంలో నిర్వహించారు. పోటీల్లో 60 జట్లు పాల్గొన్నాయి. మొదటి బహుమతిగా రూ.30 వేల ట్రోఫీ, రెండో బహుమతిగా రూ.15 వేలు అందజేశారు. పోటీల్లో విజేతలకు ఎంపీపీ రమేష్, జెడ్పీటీసీ సభ్యుడు నూకరాజు, ఎస్టీ కమిషన్ సభ్యుడు ఎం.విశ్వేశ్వరరాజు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ముసిలినాయుడు తదితరులు బహుమతులు అందజేశారు.

పట్టుదలతో చదివితే ఉన్నత స్థానాలు

జి.మాడుగుల: భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగటానికి ఇంటర్ విద్య కీలకమని, రానున్న ఇంటర్ పరీక్షల్లో అధిక మార్కులు సాధించాలని గురుకులం పాఠశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్, బాలురు ఆశ్రమోన్నత పాఠశాల హెచ్‌ఎం ప్రదీప్‌చంద్ర ఆకాంక్షించారు. మండల కేంద్రంలోని కేజీబీవీ శుక్రవారం ఫేర్‌వెల్ కార్యక్రమం ఘనంగా జరిగింది. వారు మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివితే ఉన్నత స్థానాలు అధిరోహించవచ్చన్నారు. విద్యార్థినులు చేసిన పలు సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈఎంఆర్ఎస్ ప్రిన్సిపాల్ గణేష్, బాలురు ఆశ్రమోన్నత పాఠశాల హెచ్‌ఎం బాలరాజు, కెజీబీవీ ప్రత్యేక అధికారి పార్వతి, మినీ గురుకులం హెచ్‌ఎం సువర్ణకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీరామ నవమి వేడుకపై సమావేశం


సమావేశమైన మాజీ మంత్రి బాలరాజు, గ్రామపెద్దలు

జి.మాడుగుల: శ్రీరామ నవమి వేడుకలను పురస్కరించుకొని మండల కేంద్రంలోని రామాలయంలో సీతారాముల కల్యాణ వేడుక నిర్వహణపై గ్రామస్తులు శుక్రవారం నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవాలను 28 నుంచి 30వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్టు మాజీ మంత్రి మత్స్యరాజు బాలరాజు, వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మత్స్యరాజు, గ్రామ పెద్దలు ఎం వరహాలరాజు, సింహాచలంరాజు, పెదబంగారాజు, ఉపాధ్యాయుడు భగవాన్‌రాజు, లక్ష్మీపతిరాజు, అరునరావు, కృష్ణారావు, కన్వీనర్ అడపా బాబూరావు, నారాయణరాజు, కొండందొర, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రారంభం

రాజవొమ్మంగి: స్థానిక గిరిజన సంక్షేమ బాలికల గురుకుల జూనియర్ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియేట్ ప్రాక్టికల్ పరీక్షలు శుక్రవారం సజావుగా ప్రారంభమయ్యాయి. గురుకుల కళాశాలకు చెందిన 20 మంది, మధ్యాహ్నం బ్యాచ్‌లో మరో 20 మంది ప్రాక్టికల్స్ చేశారని ప్రిన్సిపాల్ ఆర్‌వీ. మోహనరావు తెలిపారు. శుక్రవారం బోటనీ ప్రాక్టికల్స్ జరిగాయన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 20 మంది ప్రాక్టికల్స్ పరీక్షలకు హాజరుకాగా సీఎస్‌సీ గ్రూపునకు చెందిన మరో ఆరుగురు ఒకేషనల్ పరీక్షలు రాసినట్టు ప్రిన్స్‌పాల్, చీఫ్ సూపరింటిండెంట్ షేక్ మదీన్ తెలిపారు.

భూ రీసర్వేపై అవగాహన


నూగుమామిడి గ్రామసభలో ప్రసంగిస్తున్న తహసీల్దార్ శ్రీమన్నారాయణ

గంగవరం: నూగుమామిడి గ్రామంలో సర్పంచ్ కురసం అక్కమ్మ అధ్యక్షతన శుక్రవారం భూముల రీసర్వేపై గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామసభల్లో భూ రీసర్వే విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామన్నారు. రీ సర్వే కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గిరిజన రైతులు ఉమ్మడి భూములు వారసులు మ్యూటేషన్ ద్వారా విభజించుకోవాలన్నారు. అభ్యంతరాలు గ్రామసభలో స్వీకరిస్తామని, వచ్చిన అభ్యంతరాలపై విచారణ జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు నూగుమామిడి గ్రామంలో 281 మందికి ఎల్ఎంపీ నోటీసులు అందజేశామన్నారు. గ్రామసభలో ఆరు అభ్యంతరాలు, 20 మ్యూటేషన్ దరఖాస్తులు వచ్చాయన్నారు. గ్రామసభలో ఎంఆర్ఐ ఫయాజ్ బాషా(జిలానీ), వీఆర్వోలు పున్నమ్మ, అప్పలకొండ,గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

గొర్రెలు, మేకలకు టీకాలు


మేడపర్తి గ్రామంలోని పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

దుంబ్రిగుడ: మండలంలోని గుంటగన్నెల పంచాయతీ డొమంగి, జాముగుడ, గన్నెల, కూనపుట్టు, బొడ్డపుట్టు, లక్క, పిత్తగుడ తదితర గ్రామాల్లో పశుసంవర్ధక శాఖ వైద్యాధికారి గౌతమ్ ఆదేశాల మేరకు శుక్రవారం గ్రామాల్లో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 1623 గొర్రెలు, మేకలకు పీపీఆర్ వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. సిబ్బంది మహేష్ , త్రినాథరావు, అనంత్, సంజీవ్, అప్పారావు, మహేష్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి: మండలంలోని పెదబిడ్డ పంచాయతీ మేడపర్తి తదితర గ్రామాల్లో శుక్రవారం అనంతగిరి పశు సంవర్ధకశాఖ పశువైద్యాధికారి రవి ఆధ్వర్యంలోని 225 పశువులకు వ్యాధినిరోధక టీకాలను పశువైద్య సిబ్బంది వేశారు. పశువైద్య సిబ్బంది శ్రీనివాస్, మూర్తి, శ్యాం ప్రవీణ్, రైతులకు అవగాహన కల్పించారు. పశువులకు సకాలంలోని వ్యాధినిరోధక టీకాలు వేయించుకోవాలని, పశువులు వ్యాధుల బారినపడితే తమకు సమాచారం అందించాలని సూచించారు.

అంగన్‌వాడీ కార్యకర్తల ధర్నా

చింతూరు: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయానికి పక్కాభవనం నిర్మించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు శుక్రవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి వెంకట్ మాట్లాడుతూ చింతూరు ఐసీడీఎస్ కార్యాలయానికి పక్కా భవనం లేకపోవడంతో అంగన్‌వాడీ కార్యకర్తలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సమావేశాలు నిర్వహించేందుకు సరైన భవనం లేక ఇతర ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహించుకోవాల్సి వస్తోందని పేర్కొన్నారు. అనంతరం వారు ఐటీడీఏ ఏవో రాజ్‌కుమార్‌కు వినతిపత్రం అందచేశారు. సావిత్రి, దుర్గ, వెంకటరమణ, జయ, కామేశ్వరి, నూకరత్నం, స్వరూప, ఝాన్సీ పాల్గొన్నారు.

ఆవు ప్రాణాన్ని కాపాడిన పశువైద్యాధికారి


ఆవు గర్భం నుంచి చనిపోయిన పెయ్యిని తీస్తున్న వైద్యాధికారి భాస్కర్‌రావు

ముంచంగిపుట్టు: జోలాపుట్టు పంచాయతీ లబ్బూరు గ్రామంలో బొడ్నాయిక్ హద్దు అనే రైతుకు చెందిన గోవుని గర్భంలో పెయ్యి చనిపోవడంతో ఆవు పరిస్థితి ఇబ్బందికరంగా మారింది.దీంతో రైతు పశు వైద్య సిబ్బందికి సమాచారం అందించడంతో శుక్రవారం ముంచంగిపుట్టు పశు వైద్యాధికారి కె.భాస్కర్‌రావు తన సిబ్బందితో లబ్బూరు గ్రామానికి వెళ్లి గంటల కొద్ది శ్రమించి ఆవు కడుపును కోసి చనిపోయిన పెయ్యిను బయటకు తీసి ఆవును కాపాడారు. వైద్యాధికారి ప్రత్యేక వైద్యంతో ఆవును బతికించారని గిరిజన రైతు హద్దు పశువైద్యాధికారి భాస్కర్ రావు, కృతజ్ఞతలు తెలియజేశారు.

ఘనంగా కనకమహాలక్ష్మి తీర్థం

కశింకోట : మండలంలోని బయ్యవరం గ్రామంలో శుక్రవారం కనకమహాలక్ష్మి తీర్థ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయాన్ని, అమ్మవారిని పూలతో అందంగా అలంకరించారు. వేద మంత్రాల నడుమ కుంకుమార్చనలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో గ్రామస్తులతోపాటు పరిసర గ్రామాల ప్రజలు కూడా పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు సేవించారు. ఎంపీ బీవీ సత్యవతి భర్త డాక్టర్ కె.విష్ణుమూర్తి అమ్మ వారిని దర్శించుకుని, పూజలు చేశారు. ఆయనకు ఉత్సవ కమిటీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు ఆలయ మర్యాదలతో దుశ్శాలువా కప్పి, జ్ఞాపికతో సత్కరించారు. మధ్యాహ్నం భారీగా అన్న సమారాధన జరిగింది. రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఏర్పాటు చేసిన శక్తి స్వరూపిణి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు గొన్నా నాగసత్యనారాయణ, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గొల్లవిల్లి నానాజీ తదితరులు పాల్గొన్నారు. కశింకోట : మండలంలోని బయ్యవరం గ్రామంలో శుక్రవారం కనక మహాలక్ష్మి తీర్థ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయాన్ని, అమ్మవారిని పూలతో అందంగా అలంకరించారు. వేద మంత్రాల నడుమ కుంకుమార్చనలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో గ్రామస్తులతోపాటు పరిసర గ్రామాల ప్రజలు కూడా పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు సేవించారు.

వెలంపేట గౌరమ్మ ఉత్సవం నేడు

కశింకోట : స్థానిక వెలమపేట గౌరీపరమేశ్వరుల(గౌరమ్మ) ఉత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించేందుకు పూర్తిస్థాయి ఏర్పాట్లు చేసినట్టు ఉత్సవ నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. ఏటా ఆనవాయితీగా జరిగే ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. సాయంత్రం నేల వేషాలతో గౌరమ్మ ఊరేగింపు ప్రారంభమై గ్రామ ప్రధాన వీధుల్లో కొనసాగుతుందన్నారు. రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పెద్ద ఎత్తున బాణ సంచా విన్యాసాలుంటాయని పేర్కొన్నారు. ఉత్సవం అనంతరం శారదానదిలో గౌరమ్మను ఆదివారం నిమజ్జనం చేయనున్నట్టు వెల్లడించారు.

విద్యుత్ అలంకరణలో వీధులు

ఉత్సవం పురస్కరించుకుని సంతబయల పంచాయతీ ప్రధాన రహదారిలో ముందుగానే విద్యుద్దీపాలంకరణ చేశారు. పందిరి లైటింగ్, దేవతామూర్తులు, ఇతర కటౌట్లతో వీధుల్ని అందంగా మలిచారు. రిక్షాస్టాండ్ వద్ద మిరుమిట్లు గొలిపేలా ప్రవేశ ద్వారాన్ని ఏర్పాటు చేశారు. దీంతో ఒక రోజు ముందుగానే ఉత్సవ వాతావరణం నెలకొంది.

జోరుగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం


శివలింగపురం పాఠశాలలో ప్రచారం చేస్తున్న ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శెట్టి గంగాధరస్వామి


మొండిగెడ్డలో ప్రచారం చేస్తున్న ఎస్టీ సెల్ అధ్యక్షురాలు మత్స్యరాస వెంకటలక్ష్మి

అరకులోయ రూరల్/అనంతగిరి/దుంబ్రిగుడ/ముంచంగిపుట్టు/జి.మాడుగుల/గూడెం కొత్తవీధి: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపర్చిన సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని కోరుతూ జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో పార్టీ శ్రేణులు విస్తృతంగా ప్రచారం చేశారు. పలువురు మాట్లాడుతూ సుధాకర్ గెలుపు నకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు.అరకులోయలో జరిగిన కార్యక్రమంలో పార్టీ మాజీ అధికార ప్రతినిధి శెట్టి అప్పాలు, పాస్టర్ బాబూరావు తదితరలు పాల్గొన్నారు.

అనంతగిరిలో జరిగిన కార్యక్రమంలో ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శెట్టి గంగాధరస్వామి, ఎంపీపీ శెట్టి నీలవేణి తదితరులు పర్యవేక్షించారు. దుంబ్రిగుడలో ఎంపీపీ బాక ఈశ్వరి, జెడ్పీటీసీ చట్టారి జానకమ్మ, శాంతి, వైస్ ఎంపీపీ లలిత, నర్సింగ్, మల్లేష్, సింహాచలం, నేతలు కృష్ణారావు, సింహచలం, తదితరులు పాల్గొన్నారు. జి.మాడుగుల మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మత్స్యకొండంనాయుడు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రామకృష్ణ ఎంపీటీసీ సన్యాసిదొర, నాయకులు గంగరాజు, కన్వీనర్ సూర్యప్రకాష్‌నాయుడు,మాజీ సర్పంచ్ పండుదొర తదితరులు పాల్గొన్నారు. జీకే వీధిలో జరిగిన కార్యక్రమంలో ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, జి.మాడుగుల జెడ్పీటీసీ సభ్యురాలు మత్స్యరాస వెంకటలక్ష్మి , ఎంపీపీ బోయిన కుమారి, వైస్ ఎంపీపీలు ఆనంద్, దేముడు, సర్పంచ్‌లు నాగరాజు, కమలమ్మ , చింతపల్లి మాజీ వైస్ ఎంపీపీ కృష్ణారావు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టులో జరిగిన కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, టీడీపీ నాయకుల ప్రచారం

జి.మాడుగుల: బీజేబ బీజేపీ, టీడీపీ బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రచారంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన ఆధార్ అనుసంధానం

అనకాపల్లి రూరల్ : ఓటరు జాబితాలకు ఆధార్ అనుసంధాన ప్రక్రియను వేగవంతం చేయాలని అనకాపల్లి ఆర్డీవో ఏజీ చిన్నికృష్ణ బీఎల్‌వోలను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో అనకాపల్లి, కశింకోట మండలాల బీఎల్‌వోలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపడుతున్న ఓటరు జాబితాలకు ఆధార్ అనుసంధాన ప్రక్రియ ఆశించిన స్థాయిలో చురుగ్గా జరగడంలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇకపై బీఎల్‌వోలంతా త్వరితగతిన ఈ ప్రక్రియ పూర్తయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఇందుకు అవసరమైన 6బీ ఫారాల సేకరణను వేగవంతం చేయాలన్నారు. ముఖ్యంగా వలస ఓటర్లు, డబుల్ ఎంట్రీలు, బోగస్ ఓట్ల ఏరివేత పూర్తయ్యేలా చూడాలన్నారు. శతశాతం పూర్తికి బీఎల్‌వోలంతా కృషి చేయాలన్నారు. తరచూ దీనిపై సమీక్షించనున్నట్టు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పలువురు బీఎల్‌వోలు క్షేత్ర స్థాయిలో తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఆర్డీవో దృష్టికి తెచ్చారు. సమస్యల్ని అధిగమించి ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా అనుసంధాన ప్రక్రియ పూర్తి చేయాల్సిన బాధ్యత బీఎల్‌వోలపై ఉందన్నారు. తహసీల్దార్ గంగాధరరావు, ఎంపీడీవో ధర్మారావు పాల్గొన్నారు.

వైరల్ జ్వరాల కట్టడికి చర్యలు

పరవాడ : వైరల్ జ్వరాలతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు జరిపి, అరికట్టడానికి తక్షణ చర్యలు చేపట్టాలని అనకాపల్లి జిల్లా మలేరియా అధికారి వరహాలుదొర స్థానిక వైద్యాధికారులను ఆదేశించారు. ఆయన శుక్రవారం తానాం రెసిడెన్సియల్ పాఠశాలను సందర్శించి వైరల్ జ్వరాలతో బాధపడుతున్న విద్యార్థులను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అవసరమైన మందులు అందించి జ్వరాలు తగ్గు ముఖం పట్టే విధంగా చూడాలన్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలో కాలువలు, చెత్తా చెదారాల తొలగించడానికి పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. మురుగు కాలువలు, అపరిశుభ్ర ప్రదేశాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో దోమల నివారణ కోసం మందులు పిచికారీ చేయించాలన్నారు. విష జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పరవాడ పీహెచ్‌సీ వైద్యాధికారులకు వరహాలుదొర సూచించారు. ఆయన వెంట తానాం సర్పంచ్ కన్నూరిదేవి వెంకటరమణ, పరవాడ ప్రభుత్వ వైద్యాధికారి ఐ.ఆర్.రంజిత్, మలేరియా సిబ్బంది, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.